# సీతమ్మ విలాయత్

''ఆలుమొగుండ్లిద్దిరు గల్సి రాజ్యంగాని రాజ్యం మొగుళ్లువడ్డదేశం, పోతుండ రంట, మొదలు వెట్టింది ఎంకటలక్ష్మి.

''మొగులువడ్డదేశం, కానని రాజ్జెం అంట ఏందొ ? సుల్కాన జేసినట్ల జెప్పు తుండవు ? కండ్లున్నందుకు సూడదగ్గదేశం'' అంట జెప్పరాద ? అంట ఎదురాడింది పక్కింటి విఠలమ్మ.

'ఎంకటలక్ష్మి ! పెట్టివుట్టిన జన్మలు గన్కనె అన్నితీర్ల అంశలు, నేను, నేను ! అనుకుంట ఎదూరుగవొస్తుండవి. ఈవైబోగం అందరికి దక్కుతాదమ్మ ! అంట జెర పుల్ల యిర్సింది ఆడిబిడ్డ అనంతమ్మ.

ఆమాటయిన్న ఆనంతమ్మ యారాలు, అవును ! మాఅనంతక్క అంటున్నది నిజమే ! మనం ఈజంజాట్కంలవడి యిల్లేకైలాసం,మొగడే వైకుంటం అంట యాది గాన కుండ గూసున్నం. అమేరికా అంటె ? ఏం మాటలా ? సముద్రాలు దాటి పోవాల్నంట ' అంట పురి ఇంగింత ఎక్కిచ్చింది.

ఆపురి బిగిచ్చుకోకుండ సళ్లింపుగ 'శారద ! సముద్రాలు దాటినగని ఎన్కటోలె, వోడల మీదగిన నెలల కొద్ది పయినం జేసుడులేదంట. విమానం ఎక్కికూసుంటె మనం వో రాత్రి నిద్రవోయి లేసెటాల్లకె మనం అమేరికా దేశంల వాల్తమంట.

''పుణ్యం కొద్దిపురుషుడు - దర్మం కొద్దిపిల్లలు, అన్నరు. ఎట్లన్న గని సీతమ్మవొ దినే ఆనంతం అన్నయ్య అదృష్టవంతులు. పిల్లలు యిద్దరు రామలక్షణులోలె బుద్ధిమం తులై తలిదండ్రిని విమానంలదిప్పుతుండరు.' అన్నది.

ఆమాటయిన్న వరలక్ష్మి 'ఆఁ పిల్లలుండంగనె ఆయిపాయన ? నాకు లేర? పిల్లలు పిల్లులోలె ? నా కోడండ్లు జూడు పిడికెడు మెతుకులు వెట్ట ఎన్కముందైకుంట నాకు గుమ్మిలూడ్సి పెట్టి నట్ల జేస్తరు. వాళ్లకు నేను బరువైన బత్కివుండంగనె మంట్లేయ

జూస్తుండరు . ఇదంత రాత ఫలం ! ఎవరి ఖర్మ వాళ్లది ' అంట వేదాంతం బల్కింది.

'అవును వరలక్ష్మి జెప్పింది నూట్లకొక్కవూట, లేకుంటె ? మనం గన్నం ఒక్కొక్కరం పండ్ల గుత్తులోలె పదిమందికి తక్కువ గాకుండ ఏం లాబం ? అంట తాళం ఏసింది మిద్దింటి మీ నాక్షమ్మ.

అంతట్లకె పెద్దత్త తిర్పతమ్మ తీర్పు జెప్పినట్ల 'మీమాటలన్ని యింటనెవుండ మీరన్నదినిజమె ! గని మనం గూడ కనుకున్నం యింటినిండ పిల్లలను, అయితె ? వాళ్లను ఎందాక సదివిచ్చినం ? ఎంతటోళ్లను జేసినం ? అంట ఆలోచనజేయొద్ద ? అందికె వున్నదాంట్లనె తృప్తిగవుండ నేర్సుకుందం. యింగ ఆ యీగున్పులు జాలిచ్చి 'మన సీతమ్మ యింటికి వోయిరొండు దినాలుండి వొత్తం ! పొండి, సందుకలు సదురుకోండి' అన్నది.

అందరు అవునంటె, అవును , అని సీతమ్మను సాగదోల వోవారం దినాలు ముందుగనె వొచ్చి యిల్లు నిండుకున్నరు.

ఇంగ జూస్కోతల్లి యిల్లంతలొల్లి లొల్లి, పిల్లా జెల్ల, సిన్నాపెద్ద అంత గలగల ఓ పెండ్లి సందడి తీర్గ కండ్ల వడ్తుండది.

తనబలుగాన్ని జూసి సీతమ్మ మురిసిపోతుండది, వుక్కిరి బిక్కిరి ఐతుండది. ఏం జేస్తుండదొ ? ఏందొ తనకేదెలుస్త లేదు.

చేయవల్సిన పనులు శనా మిగులువడి వుండవి, అందుట్ల ముఖ్యమైంది యాది కొచ్చింది సీతమ్మకు.

సీతమ్మకు పంచాంగం మీద గురిఎక్కువ. ఆమె ఎన్కటి కాలపు మనిషి. యా పని కైన తిథి, వారం, నక్షత్రం, పేరుబలం గిన అన్ని జూస్కోని, ఆపని 'సీమా' అంట మొదలు వెడ్తది. అందుట్ల రామయ్యాగారి మాట అంటె నమ్మికె ఎక్కువ. ఆయిన మాట పోంటె సింతాకంత వార వోకుండ నడ్సుకం, అలువాటు, మళ్ల ? ఈ త్యాప ఎట్ల మర్సిందో ? ఎట్లమర్సుడేంది ? సుట్టాల సంబురానవడి యిప్పటి దాంక విలాయత్ పయి నానికి మూర్తం జూపిచ్చుకునుడు మర్సింది. అందికె ఆమె ఆత్రం ఆత్రం అంట వో పోరణ్ణి అయ్యగారి జాడకు దర్మి తుర్తుల విల్సుకరమ్మన్నది.

అయినగని సీతమ్మకు మనుస్సు మనుసుల లేదు, సీమ సిట్కుమన్న గని 'అయ్యగారు' వొచ్చినట్లుండది అంట వొండెయింట్ల కెల్లి మన్నాలకు, మన్నాల కెల్లివండె యింట్లకు ఆసువోసి నట్లె దిర్గుతుండది. ఆగడిసేపట్లనె -

'అయ్యో! నామతిమర్పు గూల, ఇంతమర్పున ఎట్లవడ్తినబ్బ? పోయే దేమొ అంతువట్టని రాజ్జెమాయె! ఈ పయిన మంటె? వో బస్సు? రైల? బూమాం, నీళ్లా పురాగా మొగులు మీద పిట్టలు ఎగిరినట్లె ఎగిరె, మీది మోటారు పయినం, మరి ఆసాంట్యాళ్ల 'క్షేమాన వొయి లాభాన వచ్చేటందుకు, అయ్యగారు మంత్రాలు సదివి మంత రిచ్చిన అక్షంతలు నెత్తిన ఏయంది యిల్లు గదులుడు ఎట్ల? ఇంగ మా ఆయిన వున్నడంటె యాదన్న వట్టిచ్చుకుంటె గద! అన్నిటికి 'నీచాదస్తం' అంట దుల్పరిచ్చుకు నుడేలెక్క, ఇంత అదృష్టం నడ్సుకుంట కల్సొచ్చి మన కడ్పుల్ల వాల్తుండది గద? సాటు కన్న నగుకుంట నాతోటి చెప్పుక సంబురపడ్తడనుకున్న గని అదేం? మనిషో? వోరాగి పైస దొర్కినంత కుషిగూడలేదు. ఈ దొర ఈ యాళ్లేనా? మా పెద్దోడు వుట్టిన్నాడు యింతె! ఆరివారం అంత కుడ్పుల్నె వుంటదంట, బయిటికి గానొస్తె ఖదరు తక్కువ అనుకుంటడో ఎందో? ఆం అదేంగాదు వుత్తపుణ్యానికి ఇంట్లున్న ఆడిది చేస్తది గద అంట తప్పిచ్చుక తిర్గుడు అలువాటైంది.

అదేందో? కొత్తరివాజు, ఆడ వున్నోళ్లకు యీడికెల్లి పొయ్యేటోండ్లు పసి పిల్లలకు గొంచవోయినట్ల బొమ్మలు గిన 'గిఫ్టులు' అంటె, మనం ఎన్కటికి సర్కారుకు 'నజరానా'ల తీర్గ దీస్క పోవాల్నంట, మరి, అవన్ని దెస్తడొ? లేదొ తెల్సు కోవాలె' అంట దీరాలు దీస్తుండంగ సీతమ్మ దోస్తు నాగలక్ష్మి - ''సీతా! తొక్కులేం జేస్తివి? మావు దొక్కు, అల్లపుతొక్కు, తురూతొక్కు, బెల్లపు తొక్కు, చింతాకాయ తొక్కు 'ఇవన్ని నీకు గుదిరినట్ల మాకెవ్వరికిరావు' ఆ పని వోరేవుకు వచ్చిందా? అంట అడ్గుతుంటె-

'ఆం అవన్ని అయినయి! పయినం మాట అనుకోంగనె, పాళ్లన్ని ఇస్రిచ్చి, దంపిచ్చి, పెద్దమర్తెవాన్లు గడ్గి ఈ తొక్కులు నింపి దేవుణి అరల దొంతులు వేర్సినట్ల వేర్సిన. మీరంత వోబుక్కకు గల్సుక సూడిండి రుచులు ఎట్లుండవొ? అన్నది.

సీతా! నీ చేతి వొడ్పు రుచుల మాట వొగరు జెప్పాల్నె? మాకు దెల్వదా? గని ఆదేశ పోండ్లు తిన్నరంటె? నీకేందొ? అంగిరీజల సన్నదు రాసి సత్కారం జేస్తరు

సూడు అన్నది. అందరు 'అవు'నన్నరు. నగుల జల్లు గురిసింది,. ఈ అరువయ్యో పడిల మళ్ల సిన్నపిల్లలైన్రు..

అవును వొదినె ! ఆడ మనోండ్లకు, రోలు, రోకలి, ఇసుర్రాయి, గిన యావి, వుండ వంట, సోలతీర్గ వోమిషను వుంటదంట, అదే పొళ్లగిన దంచుడు, ఇసురుడు జేస్తదంట అంట జెప్పుతుంటె -

ఇంగో పెద్దమనిషి అందుకోని, ఆc లేకపోతె ? మనోలె తిని తీర్కెగ గూసుంటర ? ఏంది ? చిన్నప్పటి నుండి ఆడీ మొగ బేదం లేకుండ పోటీవడ్తున్నట్ల సదివి మొగుండ్లతోటి సరి బరిగ సంపాయిస్తుండంగ మళ్ల ఆడ్కిపోయిగుడ తెడ్లచేత వట్టి పోయిల కట్టెలు ఎగనూకుడు ఎందుకు? అంట అంటుండంగనె ! ఏందోయాది కొచ్చినట్ల సీతమ్మ-

'అయ్యో మర్శిన ! మా పెద్దోణికి బెల్లప్పట్టి శనాయిష్టం ! అదెంత సేపు చేసిపెడ్త, గని, ఇంగ కారప్పూస, సకినాలు, అర్సెలు, పేణీలు మాయియ్యపురాలు, ''వొదినె నేను తాజగ జేస్కొచ్చి నీకు యాళ్లకు అందిస్త నీవు యాడ తిప్పల వడ్తవు '' అంట జెప్పి తోలింది ' ఇట్ల వీండ్ల ముచ్చెట్లాడు తుండంగనె -

అవూళ్లె వున్నోళ్ల ఒక్కొక్కరు సీతమ్మను జూసిపోదమంటవస్తుండరు. వొచ్చె టోళ్ల వూకె వొస్తుండారు ? అమ్మో ! వాళ్లా, వాండ్ల పిల్లల కంట, అప్పాలు, తొక్కులు, గాజులు, గినదీస్కోని ముద్దుగ డబ్బాలల్ల నింపుకోని ముద్దెర్లేసి వాళ్లోండ్ల పత్తా, టెలీఫోన్ నెంబర్లు గుడ బద్దురంగ దెచ్చి, ఎట్లున్న ముట్టజెప్పుండి అంట ఇచ్చిన్రు, ఇంగ వొచ్చినోళ్లంత వూకెపోతారు ? చాయె గిన దాగి బూంది బుక్కి పోవట్టిన్రు.

ఇదంత జూస్తుంటె సీతమ్మకు తానేందో, ఎం,ఎలె, ఏనో అప్సరో అయినట్ల అనుకుంటుండది. ''తానంటె మంది అందరికి ఎంత ఖదరు ! ఎంత ఘనం, ఎంత ప్రాణవార్తికం, తన మొగణికి మట్టుకు గుడ్డిగవ్వకు గొరగాదుగని అందరికి గొప్పనె, మా ఆయనోలె అంటకు ముట్టకు అంట గూసుంటె ఎవడువల్కరిస్తడు ? అందికె యింటికి యిల్లాలె దీపెం అన్నరు'' అంట ముర్సి వో బెత్తెడు ఎత్తు వెరిగింది.

ఆమె ఎత్తుపెరిగిందా ? లేదా ? గని కొంచ వోయె సామాను మట్కు యిల్లు వట్ట కుండ పెరిగింది.

ఇంటికి ఎండవడి వొచ్చిన అనంతయ్యకు సీతమ్మ చేరగొట్టిన సామానంత జూసి నిజంగనె బుగులైంది 'సీత ! ఈ మూటలు, ముల్లెలు యివన్ని ఏంది ? ఎక్కడివి ? అంట జెర అనుమానపడుకుంటనె అడిగిండు గని, ఆ మాటిని సీత ముసి ముసి నగులు నగుకుంట -

అయ్యో ! చెప్పమర్శిన ! మనం విలాయతుకు పొయ్యేముచ్చెట పునుగు వాసనోలె పసిగట్టిన ఇరుగు పొరగు పట్కపోయి వాళ్లోళ్లకు ముట్టజెప్పమంట మనోండ్లిచ్చిగ్రు. మీరు పికరు వడకుగ్రని, ఎక్కువలేదు. అంత గల్సివొపెద్ద బండికి అయితది, ఇందుట్ల మనం మోసుడు యాండది? అంట జెప్పింది.

ఆమాటిని, అరికాలిమంట నెత్తి కెక్కంగ అనంతయ్య 'ఇదేం ? నీవ్యాన మామల యింటి పయినమసుకున్నవ ? ఇందుట్ల పదోవంతుగూడ మనెంటరాదు, నీకేం తమాసనా? ఎవరివస్తువలు వాళ్లకు ముట్టజెప్పు, లేకపోతె నీవేబో? నేనురాను అంట ధూం, ధాం జేసిండు.

అంతగట్టిగ జెప్పినగని సీతమ్మకు మనస్సువట్టలేదు. మొగణిదగ్గరికి జర్గి 'మీకు దండం బెడ్త ! గిదొక్కసారి నామాట దక్కిచ్చుండి, లేకపోతె అయ్యో ! గీయింత పొట్లం బట్క పోకపోయిరి, వీళ్లగన్కపోతుండరు పారన్, అంట నన్ను ఎత్తిపొడ్సుకుంట ఎక్కిరిస్తరు, మనమెక్కిపోయె మీదిమోటరు మనవూళ్లె వొ వాడకట్టంత వుంట దంట గద, వొగాళ్ల అందుట్ల మందికి అంత యిర్కటమైతె సీటిమీది సామాను వెట్టి దానిమీద నేను ఎక్కికూసుంట, కాదు కక్కస మంటె వొ పదో ఐదో ఆడ విమానం నడిపెటాయిన సేతుల వెడ్తం ' అంట అన్నది.

''ఎంత జెప్పిన యినవ్'' అంట తువాల దులిపి బుజానేస్కొని అవుతలకి కోపాన పో జూస్తుంటె సీతమ్మ సెల్లెండ్లు ఎన్కనుండి 'ఊకోవె ! అక్క! బావ ఎప్పుడు యింతె ! అఁ బావ వొక్కడేన, ఈ మొగాళ్లకులమే యింత' అంటుండరు, ఇదంత నగులు వోయి తెగులయ్యె కాడ్కివచ్చెనంట గ్రహిచ్చుకున్న సీతమ్మ చిన్న తమ్ముడు అక్కను జూస్కుంట-

'అక్కా ! నీవు జెర వొప్కవట్టు, బావ, తిర్గి తిర్గి తిప్పగాయ ఐ యిప్పుడే ఎండవడి యింట్ల కొచ్చిండు, కాళ్లు మొకమన్న సరీగ కడుక్కోలేదు, అప్పుడె మంది

సామాను ముచ్చెట కొచ్చుడు, ఎందుకె? మీరిద్దరు బగ బగ మణుసులె! సామాను గీమాను చూసెటోణ్ణే నేనుండంగ మీకెందుకు ? ఈవాదులాట ? ఎట్లన్న సామాను మీఠేక్కెన మోటర్ల మీ ఎంట రాదు గద ? నేను ముందె తీస్కపోయి తూకంగిన ఏపిచ్చి విమానంల వెట్టిస్త' అన్నడు.

ఈ మాటలు యిన్న అనంతయ్య బావమ్మర్ది శమత్కారానికి మెచ్చుకోని అందరు గల్సి పరాశ్కాలాడుకుంట బోజినాలు గిన జేసి(న్రు.

'టైం ఐతుండది' బిరాన గదులుండి! అంట పెద్దాడిబిడ్డ ఏగిర వెట్టంగ, మంచి శకునం జూసి దొంతు లయింట్లకు నడ్సి, దేవుండ్లకు దండాలు వెట్టి పుస్తె వొట్లు కండ్ల కద్దు కోని యిల్లు బయిలెల్లి బొంబాయి జేరి(న్రు. ఆలు మొగుండ్లు.

ఆడికెల్లి విమానం ఆ రా(త్రిగడువంగ తెల్లారు ఝాంన కోళ్ళు గూయక ముందు బయిలెల్లుతది అమెరికాకు. సాగనంపవొచ్చిన సుట్టాలందరు ఎక్కడోళ్ళు అక్కడ వోయి నంక ఆలు మొగుండ్లిద్దరు విమానాల యిస్టేషన్ అంటె ఏరో(డ్రోంలకు వోయి ముసాఫిర్లు గూసుండె తావున దాన్ని 'లాంజ్' అంటరు ఆడగూసున్నరు. సీతమ్మకు వొక్కటే కూర్కి పాట్లొస్తుండవి. అనంతయ్యను అటిటు, జరుగుమని ముదరుకుంట నను కున్నదిగని,

'ఇస్సి! ఆడీ, మొగ అంత తేనెటీగలోలె దిర్గుతుండరు, సిగ్గిడ్సి యిందట్ల ఎట్ల వండుకుంట! అని కండ్లు నల్సుకోని కూసున్నది. ని(దవోంగనె మల్ల తనమణుసుల తన తొక్కుమర్తె నాన్లు ఎట్లుండవొ ? బిరుడాలు గట్టి గుండెనొ ? దెబ్బగిన దగిలి ప(రెవొస్తె నూనెగార్తదొ ఏమొ ? అంట మొగణ్ణే విల్సి 'వోత్యాప జూసిరారాదుండి? అంట అడ్గుత ననుకున్నదిగని అమ్మో! ఇందట్ల గదిరిస్తె? యాడ తల్లి' అంట వూకుండి ఆ ఎక్కాసం బట్టలేక -

'ఇదేం ? దిక్కుమాలిన మీది మోటారు ? యాళ్ళగానియాళ్ళ! దయ్యాలోలె, మన లారీల డిరేవర్ల తీర్గ ఈ విమానం చెలాయించే డిరేవర్లు గుడ- సీకటే సింగార మంట ఎన్నుకుంటరు. అవును మరి కులం అంత వొక్కటె' సీకట్ల అయితె యాణ్ణన్న తోవల ఆగవట్టి టికటి లేకుండ మందిని ఎక్కిచ్చుకుంటె రొండు పైసలు వొస్తయి' అన్న ఆశ ఈడిరేవర్లకు' అంట గులుగు తుంటె అనంతయ్యకు కోపం కుత్కెమట్టం

వొస్తున్న గని తమాయించుకోని,

'సీతా ! అందికె అన్నరు పెద్దలు కాశికి పోత పాత పెండ్లాన్ని ఎంటవెట్టుక పోయిన్రని! ఇంట్లున్నంత సేపు ఎప్పుడు పనే ! నోటెంట మాటవొల్కితె నే న్యాడ సుక పడ్తనో ? అంట వూకుంటవ్ '' అంట నన్ను పోరు వెడ్తుంటివి, ఇప్పుడు ఈడ్కివొచ్చి విమానం నడ్పె పైలెట్లను పట్కతిడ్తుండవ్ పక్కపొంటి వున్న నల్గురు యింటె ఏవను కుంటరు ? అచ్చం అడ్మవాద అడివిలకెళ్లి పట్టుకొచ్చిన 'ఎడ్డిమాలోకం' అనుకుంటరు వూకొ ; సుట్టుపక్కల అందర్ని జూడు అన్నడు.

మొగడు జెప్పింది నిజంగనె అంట సల్లవడి వొచ్చిపొయ్యేటోళ్లను జూస్కుంట గడిపింది.

ఇంతట్లకె వీళ్ల ఎక్కపిలేన్ వొచ్చింది. లౌడిస్పీకర్ల పొయ్యేటోళ్లందర్ని 'యిచ్చె కింగ్' గిన జేపిచ్చుకోని రమ్మంట విల్సిన్రు. అక్క బావలకు బద్రాలు వల్కి తమ్ముడు వోయిండు-

సీతవ్మను సెక్యూరిటి ఆడోండ్ల ఏందో ఇన్ప ఆల వెట్టిపై అంత నిమిరి సూస్తుంటె సీతమ్మకు గుల గుల వెట్టినట్టె కండ్లు మూస్కోని కిల కిల మన్నది. పాపం అడున్న పిల్లలు గుడ అమాయికురాలు అంటనగిన్రు.

మాళ్లామొగడు పెండ్లాం గల్సి వోహోలు అసోంటిదాంట్ల గూసున్నంక వోసిన్న పాటి బస్ అసొంటిదివొచ్చి అందర్ని 'పిలేన్' కాడ్కిదీస్కపోయింది, ఆ బస్సు దిగి నిచ్చెన ఎక్కి హవాయి జాజ్ లోపలిటికి వోయిన్రు. మూతల్నె ఏర్‌హోస్టెస్ నిలవడి నమస్తె వెట్టింది .సీతమ్మ ఆపిల్లను 'సల్లగ బత్కు బిడ్డ ' అంట దీవెనార్తి యిచ్చింది, ముందలికి గదిలింది, ఇదేం ? బాసనో ? అంట ఆ పిల్ల వొంగి దండం బెట్టింది. నక్కం దొక్కినట్ల వీళ్లిద్దరికి సోటు కిట్కి దగ్గెర్నె దొర్కింది. అవి 42,43, నెంబరు సీట్లు, అం దరు ఎక్కినంక ఒ గడిసేపటికి వోసోకుల పిట్టొచ్చి చాక్‌లేట్లు ఇచ్చింది, ఇంగోసోరపిల్ల వొచ్చి తననడుమ్మకు బెల్టుగట్టింది, అట్నె తనమొగణికి గూడ గట్టింది, ఇదిజూసి సీతమ్మకు శనాస్లైంది, తనమనుసుల -

'అమ్మొ ! ఏమో అనుకున్న సోకులోడే అంట అనుకోని అదో తీరు జూసింది మొగణ్ణి, అనంతయ్య ముసిముసి నగిండు,

పిలేన్ గరగర సప్పుడు జేస్కుంట కొంచెం దూరం నడ్సింది సూస్తుండంగనె యింతింత ఎత్తులేస్కుంట బంగులాల మీదికెళ్లి చెట్ల శికిరాలు చిన్నపాటి గుట్టలు గోపురాలు దాటుకుంట మొగలును అందుకుంటున్నట్ల జాయిన లేశి నడుస్తుండది. ఇట్ల వూపందుకోనిజవసత్తువల తోటి నడుస్తున్న 'హవాయిమోటారి' నడుస్తుండద ? లేదా ? అంట అనుమానం వొచ్చి నడుస్తలేదంట గట్టి జేస్కోని మొగలు మీద యాడ ? ఎట్ల ? నిలవడ్డది ? అంట మళ్ల అనుమానం వొచ్చింది, సీతమ్మకు, గని, తాను యిందాక జూసినప్పుడు యిండ్లుగిన యావి గాన్రాలేదు, యిప్పుడేమొ ! ఏందొ ? కొత్తపట్నం దగ్గెర వడ్డట్ల గండ్లవడ్తుండది, అంటె ఇది నడుస్తనె వుండది, 'అబ్బ ఏం ? శమత్కారం ! ఈడెరేవర్ది అంట మెచ్చుకున్నది.

సూస్తుండంగనె 'డిల్లి' రానె వొచ్చింది తెల్లారింది. మళ్లా వొగాయిన వో ఆడి పిల్ల వో బండిని దొబ్బుకొచ్చి నడుంగల నిలవెట్టి అందరికి వుడుకుడ్కు పలారం డబ్బులు ఇస్తుండరు, వీళ్ల ముందరి కట్కయిట్ల దిప్పంగనె సిన్న టేబిల్ వోలె ఓ పల్క అసొంటిది వొచ్చింది, దాని మీద ఆసోరపిల్ల సుట్టాలకు వొడ్డిచ్చినట్ల ముద్దుగ ముంగ్ల కాంట సెమిచె, చాయెకోపు, శక్కెర బిల్లలు వెట్టి పోయింది.

నేను కాంట గింట ముట్టుకోకుండ ముద్దుగ చేయితోటెదిన్న, ఇచ్చిన కాయితం దస్తితోటి మూతిగిన దూడ్సుకున్న, నాకు చాయ్ వొద్దు అంటె పండ్లరసం దెచ్చింది ఆయమ్మ. రాజబోగంగవోతుండ. ఎంత పుణ్యం జేసిన్నో ! ఇదేం కొంచెంఖదర ? అను కున్నది సీతమ్మ. హవాయి జాజు నడుస్తనేవుండది,. ఇంతట్ల మీదిమోటారు కిందికి దిగింది, అందరు 'రోం' రోం' అంటుండరు. మా ఆయినను అడ్గితె 'ఈపట్నం ఎన్కట చెక్రవర్తులు ఏలిన రాజ్యమంట. ఆనాటి కట్టుడాలు ఎన్నోన్నో ఈ తావున వుండవి. వచ్చెటప్పుడు దిగిసూస్తలె అన్నడు - మొగణి తెలివిని మెచ్చుకున్నది సీత.

అందరు లేసిన్రు, అయితె యిందాకటి సిడీలున్న నిచ్చెనకెళ్లిగాదు. పిలేన్కు ఇంగో పెద్దలారిడబ్బ అసొంటి దాన్నితగిలిచ్చిన్రు అందుట్లకెళ్లి నడ్సుకుంటవోతె అవుతలి దిక్కు దేల్తం.

తల్లీ ఎట్ల జెప్పిన యింటరు గని, ఆడికెళ్లి మొదలైంది యిచిత్రం, ఈత్యాప దిగెటందుకు మెట్లున్న నిచ్చెన్నె వుండది గని అది నిల్కడగ నిలవడిలేదు, వూకె మెట్లన్ని తిర్గుతుంటయి, మనం యాదన్న వొమెట్టెక్కి నిలవడ్తెసాలు, అదేమనను కిందిదాంక

దోలుకొస్తది, అయితె ఈడ వోకమాట వుండది. నీవు గన్కా వోగుమాలి దిగకుండ అట్లె నిలవడి మెల్లెగ దిగితివంటె కిందవడె బుగులుంటది. వుండుడేంది, మా ఆయినగిన నన్ను గట్టిగ సంటివిల్లను అల్మకున్నట్ల అల్మకోక పోతె నేను కాలో సెయ్యో ఇరగ్గొట్టు కుందును.

ఎట్లన్న తెలివిగల్ల పిండం నాసంగతి దెల్సుకోని ముందుగనెదిగినిలవడి నన్ను పురాగ కాగలిచ్చుకున్నడు- నాకెంతసిగ్గైందో ?

ఇదేందుండి ! పురాగ సిన్నపిలగాణ్‌లె ? అందరేవనుకుంటరు ? అంటలోపట కుసి వడుకుంటనె అడ్గిన,-

మా దొరేమొ ? నీ బద్దురం జూస్తవ ? అందర్ని జూస్తవ ? యింతకు ఈడ ఎవర్ని ఎవరు వట్టిచ్చుకోరు. సూడు అంట సుట్టూర జూపిండు, ''అవును అందరు జంటలు జంటలు ఒగర్ని వొగరు ఆనుకోని నడుస్తుండరు -

కండ్లు కిందికి దించుకున్న . ఇంతట్లకె నాకు వో ఆలోచన వొచ్చింది. ఎట్లన్న పిలేను ఆగింది. ఇందాకనె పొట్టనిండ మేస్తిమి. మళ్ల చాయె, గీయె దాగ కుండ, మన సామాను ఎట్లుండదొ చూస్తె బాగు. ఏం లేదు తొక్కులు అటిటు గదిలి నూనె గార్తె పర్కం అయితయి, రుచివోతది, అంట ఆలోచనజేసి అనంతయ్యను జూసి, ఏందయ్యా! జెర సామాను కొట్టుది తాలపుచేయి అడ్గితీస్కోండి, యాడ్కివోతం, ఇం దుట్లనె పయినం జేస్తుంటిమి అంట జెప్పుదం '' అన్నది.

అనంతయ్యకు వుగ్రం అగ్గితీర్గవొచ్చింది గని వోదిక్కుపాపం అనిపిచ్చింది, అందికె సముదాయిస్తున్నట్ల పెండ్లాన్ని జూసి-

'వో ! తిక్కదాన ! ఇంటట్ల మన వొక్కళ్లసామానెవుండది గన్కన ? అందరి తోటి మనం , మళ్లమనకు తాళపుచెయ్య యిస్తె, వుండె ? పాయె ? జిమ్మెదారి ఎవరు? అందికె యియ్యడు, మనం దిగినంక సామాన్ల చిట్టీజూసి యిస్తరు, పద అన్నడు.

వున్నట్లుండి ఆడ సీతమ్మకు ఐస్‌క్రీం గనిపిచ్చింది. తాను చిన్నప్పుడు అంటె ముప్పైఏండ్లకింద జాతర్ల ఐస్‌క్రూట్ గొన్క తిన్నది. మళ్ల యిన్నాండ్లకు తినబుద్ధి ఐంది.మొగణ్ణి వొన్నెలు వడుకుంట యిప్పియ్యమంట అడిగింది.

ఆయిన నగుకుంట రొండు ఐస్‌క్రీంలు గొనుకున్నడు, ఇద్దరు ఒగళ్లను ఒగరు

అనుకోని కూసుండి ఐస్‌క్రీం దిన్నరు. సీతమ్మ వయిసు ఇరువైఏండ్లు ఎన్కకునడ్సినట్లసి పిస్తుండది. గలగల నగాలని పిస్తుండది. ఏందో మాట్లాడుతుండది. అనంతయ్య కండ్లన్ని దెర్సినగు మొకం బెట్టి యింటుండడు.

ఇంతట్లకె ప్లేన్‌వోయే పొద్దైంది రమ్మంట విల్సిన్రు. ఈత్యాప సీతమ్మ కొంగుగిన పైవిండగప్పుకునుడు మర్సి బిరబిర నడ్సింది, ఆడనిలవడ్డపిల్ల నమస్తె అంటె ముసిముసి నగింది. ఇద్దరొచ్చికూసున్నరు. లండన్ దాటిన్రు. సీతమ్మ కిటికీల కెల్లి చూస్తుండది, ప్లేన్ నడుస్తుండది, గని సీతమ్మనె సుక్కల్ల తేలుతుండది. అనంతయ్య ఆమె నడుముసు ట్టుకోని ఆమెమీదవొర్గిలండన్ దాటినంక కండ్లవడె స్విడ్జర్‌లాండ్ మంచుకొండల సొగుసు జూస్తుండడు. అడ్గందె తనకు ఎన్నోసంగతులు జెప్పుతుండడు. ఎంత ఆనందమొ ! పెండ్లైన కొత్తల్లున్న యింత వుల్లాసంలేదు, అవును అప్పుడు సిన్నోళ్లం, సిగ్గాయె, కొత్తాయె !

''ఎన్నిసోకులు కడ్పుల వెట్టుకున్నడొ ? నేను వుత్తపున్యానికి ఆడిపోసుకుంటి ఈత్యాప అట్ల జేయను, అంట. ఆయిన దగ్గరికి జరిగి పంకాగాలికి ఎగురుతున్న మొకం మీద ఎంటికలు వాలుతుంటె ఏందో ? లయలు వడుకుంట ముచ్చెట జెప్పుతుండది.

మల్లావొత్యప ఆవలికి పొరజూసింది. ఇప్పుడు సముద్రం మీద విమానం పయినం జేస్తుండది. తెప్పలు దాటి మీద నడుస్తుండది. గద్దకన్న ఎత్తున వోతుండది. యాది సముద్రం ? యాది మొగులు ? ఏదికొన ? ఏది తుద? దెలుస్తలేదు ? అందికె సీత మొగణ్ణి గదిలిచ్చి ఈ సంగతె అడిగింది.

ఆయిన పెండ్లాం బుజం మీద నెత్తి వాలిచ్చి ''యిప్పుడు మనం సముద్రం మీద పోతుండం, ఇట్ల ఆరుగంటలు ఏకసిస్తుగ సాగితె రేపటికల్ల అమేరిక వొస్తది '' అన్నడు.

ఆమాటయిన్న సీతమ్మకు ఎందుకొ ? కడ్పుల బయం జొచ్చింది 'అనుకో వొద్దు గని, కీడెంచి మేలు ఎంచాలె' అన్నరు, వొగ్యాళ్ల ఈ మీది మోటారుకు యాదన్న అనువు జెడి బిసదప్పుతె అప్పుడు దిగుడుయాడ ? ఎట్ల ? ఈ అంతు పొంతు లేని సముద్రయ్య వొడిల యాడంట కాలు మోపుతం ? ఎట్లబ్బ? అంట బుగులువడి మొగణ్ణి కండ్లల్ల బయం తొంగిసూడంగ,

''అయ్యో ! గిసొంటి కాడ వుపద్రం గినముంచుకొస్తె ఎట్ల ?'' అంట అడిగింది, ఆయిన నగినట్ల కండ్లవడ్డ మనుసుల బయంగనె

'తిక్కదాన ! చెడ్డు ఆలోచన జేయకు, అసొంటి జర్గగూడని విపరీతం జర్గనే గూడదు. వొగాళ్ల నీవన్నట్ల జరిగిందె ! అనుకొ ? అసొంటప్పుడు, బూమి ఏంది ? నీళ్లేంది ? అన్ని వొక్కటె మనను మింగెటందుకు ? సముద్రం గాకుండ బూమ్మీదంగ యింత ఎత్తునుండి అంటె 'వోవాడకట్టంతవిమానం కిందంగ జూసెటోళ్లకు పతంగి తీర్గ కానొచ్చె అంత ఎత్తునుండి గూల్తె, అందుట్లున్న మనం బూమి జేరక ముందే సొర్గం బోతం, ప్రాణాలు వోయినంక, కన్ను, ముక్కు, కాళ్లు, సేతులు,కండలు అంట గుర్తు వట్టకుండ నుగ్గునుగ్గు, నుసి నుసి,ఐ యాడవడ్తయో ? ఏందొ ? అందికె యిసొంటి . బయాలు యిడ్సి 'నల్లగిరితోటినారాయణ' అంట కుశాలుగ నగుకుంట, నల్లగిర్ని జూస్కుంట పాట యినుకుంట నా మీదవాలి జెరసేపు వండుకో '' అన్నడు.

''అమృతం గుర్సిన ఆ గార్వాల మాటలు యిన్నసీతమ్మ, అన్నిమర్సి 'నీవెంత మంచోడవయ్య' ! అంట పసిపిల్లోలె మీద వాలి నిద్రవోయింది. సముద్రాలు దాటిన్రు. తెల్లారింది, మల్లా చాయ్, పలారం, పండ్లు, పొలావ్ అన్నం అన్ని యిచ్చిన్రు.

ఆవలీవలికి వోను గుడ వో అర్రవుండది. అక్కొరవొచ్చినప్పుడు అనంతయ్య సీతమ్మను ఎంటవెట్టుకొచ్చి 'తలుపు గడేసుకోకు, నేను ఈణ్ణెనిలవడ్త ' అంట జెప్పిండు, సీతమ్మ సిన్నపిల్లోలె వోసేత తలుపు గట్టిగవట్టుకోని వెొుకంగిన గడుక్కున్నది, మల్ల అనంతయ్య తల్పు దియ్యంగ బయిటికొచ్చింది, అన్నిసుకురంగ జర్గి పోయినయి.

అమెరికావొచ్చింది. పిలేన్ దిగిన్రు. కొడ్కు, కోడలు గానొచ్చిన్రు. కొడ్కును జూసి సీతమ్మ ఎప్పుడు ఎదలకు హత్తుకుందన ? అన్నంత ఆత్రపడుతుండది. కోడలు ముద్దుగ అంగిరీజు బొమ్మతీర్గ కండ్లవడుతుండది.

అన్నిలాంచినాలు పూర్తిజేసిన్రు, ఎంటదెచ్చిన రొండు సేతిసంచులు దప్ప సీతమ్మకు తన దోస్తులిచ్చి ముట్టజెప్పమన్న సామాన్ పెట్టె తనమర్తెవాన్లు, రొండు పెద్ద సందుకలు కండ్ల వడ్త లేవు . మనుసు పరి పరి విధాల వోతుండది. ఇంతసంబురాల గుడ ఆఖ్యె ! సామాను ఏమాయె? తిప్పలవడి ఇర్సి, దంచి, చేసిన అప్పాలు, తొక్కులు, ఏమాయె? యాణ్ణన్న మరిసిరా? ఏందొ ? ఈయన ''మాలోకం మరీ '' అంట అను కోని 'ఆఁ ఏం మనిషో ? యాదివట్టిచ్చుకోడు ! అంట మున్పటి పదమే పాడ్కుం మొదలు వెట్టి అనంతయ్యను జూసి 'మనం చట్ పట్ మంట సేతులూపుకుంట

నడుస్తుండం! మనసామాను సంగతి ఏమాయె? అంట అడ్గింది.

'జరఆగు! అడ్కొగద పోతుండం! మనం వో హోల్ల గూసుంటె ఆడ్కి సామానొస్తది అంట జెప్పింది.

'ఈడ అంత సిత్రమె! అంట గూసున్నది.

ఇంతట్లకె సామనొచ్చె, వొచ్చె' అంట లొల్లి వుట్టింది. నిజంగనె, ఏందొ? దొబ్బుడు బండి అసొంటిది మోస్కొచ్చి వో గుండుగ గట్టిన తావున రైలుపట్టాలసొంటి దాని మీద గుమ్మరిచ్చి పోతుండది, ఈసామానంత వొ పెట్టె ఎంట వోటి గుండుగ దిరుక్కుంట వొస్తుండవి, అందరు వాళ్ళ వాళ్ల వస్తువలు గుర్తువట్టి పట్టాల మీది కెళ్లి గుంజకుంటుండరు.

ఇంతట్లకె మనోండ్ల సామానొచ్చింది. సీతమ్మ మనసామాను నొస్తుండది, పట్టుకోండి అంట పెద్దగ అనంతయ్యకు సంబురంగ జెప్పుతుండది, తనరొండు తోలు సందుకలు వొచ్చినవి,రొండు చేతి సంచులు, వో అట్టపెట్టె వొచ్చింది మొత్తం నాలుగు, మరి తన తొక్కుల గతి? దోస్తుల సామాను, ఎట్ల? ఎదిరిసూస్తుండది, నిమిషాలు, గంటలు గడ్సి పోతుండవి. సామాను మోసే చక్రం తిర్గి తిర్గి 'ఇంగ లేదు' అన్నట్లు ఆగిపోయింది. ఎవ్వరు ముట్టని రొండు పెట్టెలు నడుంగలు పారేసిపోయింది మిషన్.

సీతమ్మ పై నిండ చెమటలు పుట్టినంత పనైతుండది,ఇంగ వుండవట్టలేక పక్కలున్న మొగణ్ణి వూపి, వూపి, ఏమయ్య? మన తొక్కుల అయిదు మర్తెవాన్లు ఏమైనట్లు? అంట అడ్గుతుండది. నిద్ర మేల్కున్న అనంతయ్య పక్కలవున్న పెండ్లాన్ని కుదుపు కుంట.

''ఏమే? సీతా! కలవడ్డదా? అంట అడ్గి, లే! లే! తెల్లారొచ్చింది'' అన్నడు.

'అవును! నేను కొడ్కును జూడ పారన్ బోయిన మనిద్దరం బోయినం' అన్నది.

సరె! అంట ప్రాణవార్తికంగ సీతమ్మను అనంతయ్య దగ్గరికి దీసుకున్నడు.